
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
బుధవారం 17 జూలై 2024



హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై వారితో చర్చించారు. జిల్లాల వారీగా రైతు రుణమాఫీపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఇతర జిల్లాల కలెక్టర్లు.

- జనగామ (ఆంధ్రజ్యోతి)



బాల్యాన్ని బలి చేయొద్దు!

- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం
- 'ఆపరేషన్ ముస్కాన్' పేరిట స్పెషల్ డ్రైవ్
- యేటా జనవరి, జూలైలో నిర్వహణ
- ముమ్మరంగా కొనసాగుతున్న రెండో విడత

జనగామ కల్చరల్, జూలై 16: బాల్యాన్ని బలి చేయొద్దనే నినాదంతో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనవరిలో 'ఆపరేషన్ స్మైల్, జూలైలో 'ఆపరేషన్ ముస్కాన్' పేరిట యేటా రెండు సార్లు సర్వే నిర్వహిస్తోంది. చిన్నారులు, వీధి బాలలు, అనాథలు, తల్లిదండ్రులు మందలించారనే కోపంతో ఇంటి నుంచి పారిపోయిన వారు బాలకార్మికులుగా చేరితే వారిని సంరక్షించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. నిరుపేద కుటుంబాల్లోని పిల్లలు హోటళ్లు, కిరాణం దుకాణాలు, ఇటుక బట్టీలు, బైక్ మెకానిక్ షాపుల్లో పనులు చేస్తున్న వారిని గుర్తించి వారికి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం 2016 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో సంవత్సరానికి రెండు సార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

మూడు డివిజన్లుగా..

జిల్లాను స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, వర్ధన్నపేట మూడు సబ్ డివిజన్లుగా విభజించి స్త్రీ, శిశు సంక్షమ శాఖ అధికారులు పర్యటిస్తున్నారు. ఈ బృందంలో స్త్రీ సంక్షేమ శాఖ అధికారి, చైల్డ్‌లైన్ సిబ్బంది, ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు, విద్య, వైద్య, కార్మిక శాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారు. బాలకార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించారు. వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.



జనగామలో బాలకార్మికులను పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

అధికారులు గుర్తించిన ప్రాంతాల వద్ద పర్యటించి పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు.

హాట్ స్పాట్‌లు ఇవే...

బాలకార్మికులు ఎక్కువగా ఉండే అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్టాండు, జనసామర్థ్యం కలిగిన జంక్షన్లు, చౌరస్తాలు, నిర్మాణ స్థలాలు, షాపులు, హోటళ్లు, బ్రిడ్జిలు, ఇటుక బట్టీలు, కర్మాగారాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ప్రతీ బృందంలో ఒక మహిళా సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టారు.



జనగామలో బాలకార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఇటీవల జరిగిన సంఘటన...

ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు జనగామ జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రీలో పని చేస్తున్నారు. వాళ్ల పిల్లలు ఇక్కడ స్కూలుకు పోకుండా అక్కడే వాళ్లతో పాటు ఆడుకుంటున్నారు. వారిని ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సహాయంతో పాఠశాలలో చేర్పించారు.

విధులు..

తప్పిపోయిన, ఇంట్లో నుంచి పారిపోయిన, బాలకార్మికులను గుర్తించి 24 గంటలలోపు జిల్లా లోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరుస్తారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ద్వారా ఆ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసిన తరువాత అప్పగిస్తా రు. సరైన చిరునామా దొరకని పిల్లలను చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్‌లో చేరుస్తారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం..

- లక్కుంట్ల రవికాంత్, బాలల పరిరక్షణ అధికారి, జనగామ



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు నలుగురు బాలకార్మికులను గుర్తించాం. వారితో పాటు స్కూల్ డ్రాపవుట్ అయిన ఐదుగురు మైగ్రేట్ ఫ్యామిలీల పిల్లలను, కొత్తగా ముగ్గురు పిల్లలను బడిలో చేర్పించాం. బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయి.

వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పిస్తాం..

- జట్టి జయంతి, జిల్లా సంక్షేమ అధికారి, జనగామ



వెట్టి చాకిరీ, బాల కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి కల్పించి బాలబాలికలకు బంగారు భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగుతున్నం. 18 సంవత్సరాల లోపు బాలబాలికలను ఎవరూ పనిలో పెట్టుకోవద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటాం.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో
దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూలై 16: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కె. దయానంద రాణి ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా జిల్లాలో 5వ తరగతి రెసిడెన్షియల్ పాఠశాలల్లో మిగిలిన 19 సీట్ల భర్తీ కోసం ఎస్సీ విద్యార్థిని, విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

నేటి తొలి ఏకాదశి, మొహర్రం
వివరాలు 7వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో ఎంపీ కావ్య

తమాషా చేస్తున్నారా?

- సమర్థవంతంగా పనిచేస్తేనే విధుల్లో ఉంటారు
- డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు గ్రామాల్లో పర్యటించాలి
- సెర్ప్ అధికారులపై ఎమ్మెల్యే కడియం ఆగ్రహం

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 16: పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తమాషాలు చేస్తున్నారా అంటూ విరుచుకుపడ్డారు. సక్రమంగా పనిచేస్తేనే విధుల్లో ఉంటారు అంటూ హెచ్చరించారు. సంస్థ అమలు చేస్తున్న కార్యక్రమాలపై మంగళవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీవోఏలతో నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. డీపీఎం సమ్మక్క జఫర్‌గడ్ మండల పరిధిలోని వీఓఏల గ్రేడింగ్ పాయింట్స్ చదువుతున్న క్రమంలో ఎక్కువ మొత్తంలో బీ-గ్రేడ్, సీగ్రేడ్‌లలో ఉండడంతో కడియం స్పందించి బీ-గ్రేడ్, సీ-గ్రేడ్‌లు ఎందుకు వస్తున్నాయని, సంఘాలు మెరుగ్గా ఎందుకు పనిచేయడం లేదని, బాధ్యులు ఎవరని ప్రశ్నించగా ఎవరి వద్ద నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో ఏపీఎంలు, సీసీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల పనితీరు మెరుగుపడాలని, అన్ని గ్రూపులకు ఏ-గ్రేడ్ వచ్చేలా ప్రతీ ఒక్కరు పని చేయాలని, ఇక నుంచి ప్రతీ నెల డీఆర్డీవో రివ్యూ నిర్వహించాలని ఆదేశించారు. ఏపీఎంలు, డీపీఎంలు ఆఫీస్‌లకు పరిమితం కాకుండా నెలకు 10 రోజులు ఎస్‌హెచ్‌జీల వద్దకు వెళ్లి రివ్యూ నిర్వహించాలని సూచించారు. వీవోఏలు, ఎస్‌హెచ్‌జీ మహిళల సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని, వారానికి రెండు రోజులు క్షేత్రస్థాయిలో డీపీఎంలు సందర్శించాలని ఆదేశించారు. వీవోఏలు బాగా పనిచేస్తేనే ఉంటారని హెచ్చరించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండి అనేక పనులు చేస్తున్న వీవోఏలకు పారితోషికం రూ.10వేలు చేయాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గంలో 75వేల మంది మహిళలు ఎస్‌హెచ్‌జీలలో ఉండడం గొప్ప విషయమన్నారు. వానా కాలం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాలకు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీపై రుణాలు ఇస్తున్న మాదిరిగానే మహిళ సంఘాలకు సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మహిళ సమాఖ్య భవనాలను నిర్మిస్తానని ప్రకటించారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ మహిళలు ఇంటిని చక్క దిద్దిన విధంగానే గ్రామాలను చక్కదిద్దాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న రోజుల్లో సెర్ప్ సిబ్బంది కష్టపడి పని చేసి ఘన్‌పూర్‌ను ఆదర్శంగా నిలుపాలని కోరారు.

కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, ఏసీపీ భీమ్‌శర్మ, డీపీఎంలు సుధీర్, వినీత, రాజేంద్రప్రసాద్, సమ్మక్క, వరలక్ష్మి, ఎపీఎంలు కుమార్, సంపత్, రమేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మాచర్ల స్రవంతి, పంజాల మంజుల, కొలిపాక కోమల, నాయకులు కొలిపాక సతీష్, బూర్ల శంకర్, కోతి రాములు, రజాక్‌యాదవ్, నీల గట్టయ్య, పల్లె రవీందర్, సంపత్‌రాజ్, రామకృష్ణ, తోట సత్యం, గుర్రం రాజు, చిగురు సరిత, కుందూరు జ్యోతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా...

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



కోలుకొండలో పర్యటిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల, జూలై 16: నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మనఊరు-మన ఎమ్మెల్యే పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె కోలుకొండలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం సరిగా అందుతోందా లేదా అని ఆరా తీశారు. పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని, మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. వీధులన్నీ కలియ తిరుగుతూ మహిళలు, పిల్లలను పలకరిస్తూ, ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతూ గ్రామంలో మురికి కాలువలు, సీసీ రోడ్లను పరిశీలించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తమకు కొత్త పెన్షన్లు రావడం లేదని కొంత మంది విన్నవించారు. అనంతరం పలు ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు అప్పగించారు. నియోజకవర్గంలోని ప్రతీ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి బాటలో ఎమ్మెల్యే..

దేవరుప్పుల మండలం కోలుకొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడి ర్యాలీలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాల్యం నుంచే పిల్లలకు చదువుతో పాటు ఆటపాటల పట్ల ఆసక్తి ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డీఈవో రాము, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో సురేష్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ నవీన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్



స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 16: స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీ, క్లస్టర్ ఆసుపత్రిని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్ రాజ్ మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపీ, వార్డులు, ఆపరేషన్ థియేటర్, సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన మందులు ముందే సమకూర్చుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ పనులు, పారిశుధ్యం, రోగులకు డైట్ విషయాల్లో ఎక్కడా అలసత్వం వహించరాదన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాంజనేయులు, వైద్యులు జనార్ధన్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కౌన్సెలింగ్ పూర్తి

జనగామ రూరల్, జూలై 16: ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ మంగళవారం పూర్తయింది. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జిల్లా ఇంచార్జి పంచాయతీ అధికారి అనిల్ కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 281 మంది పంచాయతీ కార్యదర్శులు ఉండగా వీరిలో జిల్లా క్యాడర్లో పనిచేస్తున్న వారు 74 మంది ఉన్నారు. వీరందరికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులను కేటాయించారు. వారికి ఈనెల 20 లోగా ఆర్డర్లు ఇస్తామని ఇంచార్జి పంచాయతీ అధికారి అనిల్ కుమార్ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 16: భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేసి హత్యచేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ వరంగల్ ప్రధాన సెషన్స్ జడ్జి బి. నిర్మలా గీతాంబ మంగళవారం తీర్పు వెలు వరించారు. అదే విధంగా భార్యను శారీరకంగా, మానసికంగా హింసించిన కేసులో మూడు సంవత్సరాల జైలు, రూ. వేయి జరిమానా విధించారు. కాగా ఈ రెండు శిక్ష లు ఏకకాలంలో అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బండకింది తం డాకు చెందిన భూక్యా గోపాల్ కూతురు రమను అదే మండలం జయరాం తం డాకు చెందిన లావుడ్యా శ్రీనుకు 20 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం జరిపిం చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెళ్లైన కొంత కాలానికి మద్యానికి బాని సై భార్యపై అనుమానంతో నిత్యం వేధిస్తుండేవాడు. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించి నచ్చచెప్పారు. అయినప్పటికీ నిందితుడిలో మార్పు రాకపోవడంతో రమ 22ఏప్రిల్ 2016లో ఉమెన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇది ఇలా ఉండగా 1 జూలై 2016న ఆమెను నమ్మించి వ్యవసాయ భూమిలో పత్తి గింజలు పెట్టడానికి తీసుకెళ్లాడు. మర్నాడు అనగా 2 జూలై 2016న కూడా వ్యవసాయ పనులకు తీసుకెళ్లి పనుల అనంతరం ఇంటికి వచ్చారు. ఇం ట్లోనే గొడవ సృష్టించి ఆమెను విపరీతంగా కొట్టి కిరోసిన్ పోయగా ఆమె అరుస్తూ బయటకు పరుగులు తీసింది.

అయినప్పటికీ వెంటపడి అగ్గిపెట్టెతో నిప్పంటించగా గ్రామస్తులు చూసి మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో కాలిన గాయాలతో ఉన్న రమను ఆస్పత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ 5 జూలై 2016న మరణించింది. దీంతో నిందితుడు లావుడ్యా శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ. 4 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ.సోమునాయక్ సాక్షులను ప్రవేశపెట్టగా ఏసీపీ ఎల్. ఆదినారాయణ, సీఐ సూర్యప్రకాష్ కేసు దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ జమునాదేవి, బిందుశ్రీ

వరంగల్ మెడికల్, జూలై 16 : రాష్ట్ర ఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండలోని పలు స్కానింగ్ సెంటర్లలో రాష్ట్ర మానిటరింగ్ కమిటీ బృందం డాక్టర్లు జమునాదేవి, బిందుశ్రీ ఆకస్మిక తని ఖీ నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం నియ మాలను పాటి స్తున్న తీరు, అనుమతి పత్రాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చట్టరీత్యా నిషేధమని ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాలికల నిష్పత్తి తగ్గుతున్న నేపథ్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తనిఖీ విషయాలను కమిషనర్ కుటుంబ సంక్షేమశాఖకు అందజేస్తామని పేర్కొన్నారు. స్కానింగ్‌కు వచ్చిన గర్భిణులు, వారి సహాయకులతో మాట్లాడి వారు ఇచ్చిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ మంగమ్మ, డీఈవో సందీప్‌లు పాల్గొన్నారు.

నాబార్డు ద్వారా రూ.460 కోట్ల రుణాలు

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 16 : నాబార్డు ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ రైతు సేవా సహకార సంఘాలకు వివిధ వ్యాపారాల నిర్వహణ కోసం రూ.460 కోట్లు మంజూరు అయినట్లు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. మంగళవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకులో కమర్షియల్, రీజినల్ రూరల్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల జోనల్ వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు, పెట్రోల్ పంప్స్ రైస్ మిల్లులు తదితర వ్యాపారాలను సహకార సంఘాలు నిర్వహించుకొని తద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు నాబార్డు రుణాలు మంజూరు చసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జీయం ఉషా, సీఈవో వజీర్ సుల్తాన్, పౌల్ట్రీ ఫామ్స్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పాల్గొన్నారు.

కేయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రాంగణ నియామకాలు

కేయూక్యాంపస్, జూలై 16: కేయూ కెమిస్ట్రీ విభాగం నేతృత్వంలో హైదరాబా ద్‌లోని జినోమ్ వ్యాలీ యూరోఫిన్స్ అడ్వినాస్ డిస్కవరీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈసందర్భగా కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. సవితాజ్యోత్స్న మాట్లాడుతూ..ఇంటర్వ్యూలకు 8 మంది ఎంపిక య్యారని వీరిలో ఆర్ట్స్ కళాశాల, ఐదేళ్ళ ఇండిగ్రేటెడ్ కోర్సుల విద్యార్థులున్నారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 15 వేల పారితోషికం చెల్లిస్తారని వివరించారు.

కేయూలో బాధ్యతలు చేపట్టిన అధికారులు

కేయూ క్యాంపస్, జూలై 16 : కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియం త్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు ఇప్పటి వరకు అదనపు పరీక్షల నియంత్రణా ధికారిగా పనిచేసిన డాక్టర్ చాడ రాధికారెడ్డి నుంచి బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా రాధికా రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజ నీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. రమణ,, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. బిక్షాలు, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి . జగన్మోహన్‌రాజులు ఆయా విభాగాల అధిపతు లుగా పదవీ బాధ్యతలు చేపట్టారు.


విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కేయూక్యాంపస్, జూలై 16 : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యా ర్థులు ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని, వర్సిటీ ప్రతిష్ఠను పెంచాలని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీరటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం బీఫా ర్మసీ చివరి ఏడాది విద్యార్థుల వీడ్కోలు సమావేశం కేయూ ఫార్మసీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రతిష్ఠ ఖండాం తరాలకు వ్యాపించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో మన కళాశాల విద్యార్థులు ప్రధాన భూమిక వహిస్తున్నా రని కొనియాడారు. కేయూ పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ ప్రాం గణ నియామకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెలకువలను నేర్పిం చారు.

వాహనాలు లోపల.. అర్జీదారులు బయట

ఐనవోలు, జూలై 16: ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో వాహనాల పార్కింగ్‌తో అర్జిదారులు కూర్చోవడం కాదు కదా నిల్చోవడానికి స్థలం లేకుండా పోతోంది. వివిధ గ్రామాల నుంచి పనుల కోసం కార్యాలయానికి వచ్చే అర్జిదారులు కుర్చోవడానికి కుర్చీలు లేక నిలబడటానికి స్థలంలేక ఇబ్బందులు పడుతుంటే సందేట్లో సడేమియాల ఉద్యోగులు సిబ్బంది తమ ద్విచక్రవాహనా లను ఏకంగా బిల్డింగ్ ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో భవనం లోపల ఉండాల్సిన అర్జిదారులు ఆరు బయట నిల్చుంటున్నారు. ఆరు బయట ఉండా ల్సిన వాహనాలు భవనంలో లోపల ఉండడం గమనార్హం. తహసీల్దార్ చొరవ తీసుకొని కార్యాలయానికి వచ్చే అర్జిదారుల కోసం బెంచీలు వేయించి వాహ నాల పార్కింగ్‌ను భవనం బయట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సకల శుభాలు కలిగించే తొలి ఏకాదశి



హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జూలై 16 : హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యమున్న తొలి ఏకాదశి పర్వాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో ఆచరించు కునేందుకు జిల్లా ప్రజలు సమాయత్తమ య్యారు. ఆషాఢమాసంలో శుక్లపక్షాన వచ్చే ఏకాదశి నుంచే దక్షణాయపర్వం ప్రారంభం కానుంది. గుమ్మాలకు తోరణాలు కట్టి ఇష్ట దైవాలైన వేంకటేశ్వరస్వామి, క్షీర సముద్రంలో లక్ష్మీ సమేతుడై ఉన్న శ్రీమన్నారాయణుడిని కొలవడడంతో పాటు ఉపవాసం ఉంటే అన్ని కార్యాలు నెరవేరుతాయన్నది విశ్వాసం. మహా సాధ్వి సతి సక్కుబాయి ఈ వ్రతాన్ని ఆచరించే మోక్షసిద్ధి పొందిందని, దీంతో పాటు మౌనం ఉండటం ఉదయాన్నే విష్ణు సహస్ర నామ పారా యణం వినడం, ఉదయం విష్ణు ఆలయాన్ని ప్రదోశకాల సమయంలో శివా లయాలను సందర్శించడం, సందర్శించిన వారికి మంచి ఫలితాలు ఉంటా యన్నది ఈ ఏకాదశి పర్వదిన విశేషం. విష్ణుమూర్తి పాల కడలి యోగా నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని సయన ఏకాదశి అని కూడా పిలవడం ఆనవా యితీ. వేంకటేశ్వరస్వామికి ఎర్రని పూలతో, తులసీ దళాలతో పూజలు చేస్తే సత్ఫలితాలు ఉంటాయని నమ్మకం.

పూలకు భలే గిరాకీ..

తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో అలంకరణలు, ప్రత్యేక పూజలతో పాటు ప్రజలు ఇళ్లల్లో కూడా పండుగ వేడుకలను నిర్వహించుకుంటారు. ఈ క్రమంలో పూలకు గిరాకీ పెరిగింది. మంగళవారం కిలో మల్లెపూలు

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రూ.వేయి పలుకగా, చామంతులు కిలో రూ. 400, గులాబీలు కిలోకు రూ.300 పలికాయి. వర్షాల నేపథ్యంలో పూలు కూడా తక్కువగా వచ్చినా.. అధిక ధరలున్నా పండుగ కోసం పూలను కొనుగోలు చేశారు.

ముస్తాబైన ఆలయాలు..

ఏకాదశి పర్వదిన ప్రత్యేక పూజల కోసం ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. అలాగే వరంగల్ భద్ర కాళి అమ్మవారి ఆలయం, బట్టల బజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వర ఆలయం, జేపీఎన్ రోడ్డు గీతా భవన్ కృష్ణ మందిరం, వేంకటేశ్వరాలయం, కాశిబుగ్గ శ్రీరంగనాథ స్వామి దేవాలయం, డాక్టర్స్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆకారపు వారి గుడి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, ఇస్కాన్ శ్రీకృష్ణ మందిరం, పోతన రోడ్డు మురళీకృష్ణ మందిరంతో పాటు నర్సంపేటలోని వేంకటేశ్వరస్వామి, దుగ్గొండిలోని వేంకటేశ్వరాలయం, కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి, రాయపర్తి సన్నూరులోని వేంకటేశ్వర ఆల యాల్లో అభిషేకాలు, అలంకరణలకు ఏర్పాట్లు చేశారు. కరీమాబాద్ ప్రాంతంలోని బీరన్న దేవాలయంలో బోనాల పండుగను నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి పర్వదినాల రోజున ఎలాంటి ఆహారం భుజించకుండా ఉపవాస దీక్ష చేస్తే భగవత్ అనుగ్రహం కలుగుతుందని నమ్మకం. ఇక కొన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ ఏకాదశిని పెద్ద ఏకాదశి అని పిలుస్తారని, పిండి వంట లతో మాంసాన్ని కూడా భుజిస్తారట. సంప్రదాయ బద్ధంగా పెద్ద ఏకాదశి పండుగ రోజున కంచంలో బొక్కను కొట్టే ఆచారాన్ని పాటిస్తారట.

సమధర్మం, త్యాగానికి ప్రతీక మొహర్రం

నేడు పీర్ల పండుగ

జఫర్‌గఢ్, జూలై 16 : సుమారు 14 శతాబ్దాల క్రితం ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం జరిగిన చరిత్రాత్మక పోరాటమే మొహర్రం. హిజ్రీ క్యాలండర్ ప్రకారం నూతన సంవత్సర ఆరంభ మాసమే మొహర్రం. ఈ నెల ఆరంభం నుంచి ఇస్లాం కొత్త సంవత్సరం ప్రారంభమ వుతుంది. శాంతి, సమధర్మం, మానవత్వానికి ప్రాణం పోసిన ధీరుడు, మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్. ప్రేమ మూర్తిగా, ధర్మశాస్త్ర ప్రావీణ్యుడిగా ప్రజలను కాపాడేందుకు అత్యంత ధైర్య సాహసాలతో తన తోటి వారిని ముందుకు నడిపి ప్రశంసలందుకున్నారని ప్రతీతి. ప్రవక్త తెచ్చిన ఇస్లాం ధర్మాన్ని నిర్వీర్యం చేస్తున్న ఇరాక్ రాజు యజీద్ తనకు మద్దతు ఇవ్వాలని ఇమామ్ హుస్సేన్‌ను కోరగా, తాను ప్రజాస్వామ్య పాలన కోసం ప్రజల వైపే నిలబడతానన్నారని, ఇమామ్ హుస్సేన్ తన పరివారంతో కలిసి కుఫాకు బయలుదేరుతున్న విషయాన్ని తెలుసుకున్న యజీద్.. తన సైన్యాన్ని పంపించి ఇరాక్ సమీప ప్రాంతంలోని కర్బలా మైదానంలో అడ్డుకుని పది రోజుల పాటు యుద్ధం సాగించాడని చెబుతుంటారు. ఇందులో ఇమామ్ హుస్సేన్ బంధువర్గం 72 మంది వీరో చితంగా పోరాటం చేసి మరణించారు. పదో రోజు ఒక్కడిగా మిగిలిన హుస్సేన్ శత్రువుల అనుమతితో ప్రార్థన చేస్తున్న సమయంలో వెన్నుపోటు పొడిచి సంహరించడంతో వీర మరణం పొందాడు. ఈ ఘట్టాన్ని స్మరిస్తూ ఏటా సంప్రదాయబద్ధంగా మొహర్రం నిర్వహిస్తున్నారు. ఇమామ్ హుస్సేన్ వీర మరణానికి నిదర్శనంగా చావిడిలో పీర్లను తయారు చేసి ఉంచి 9 రోజుల పాటు పూజిస్తారు. చదివింపులు, పూజలను కుల మతాలకతీతంగా నిర్వహిస్తారు. 10వ రోజున తెల్లవారు జామున అగ్నిగుండంలోకి పీర్లు ప్రవేశించి ఊరంతా గ్రామోత్సవం పేరుతో ఊరేగిస్తారు. ప్రాణత్యాగం చేసిన ఉదంతాన్ని షహదత్‌గా (మొహర్రం)గా జరుపుతారు.



జఫర్‌గఢ్ మండలం తిమ్మాపూర్‌లో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం

నేడు పీర్ల ఊరేగింపులు..

మొహర్రం సందర్భంగా నూతన వస్త్రాలతో అందంగా ముస్తాబు చేసిన పీర్లను బుధవారం జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఊరేగిస్తారు. అసయ్ దులా.. అంటూ డప్పు చప్పుళ్లతో వీధుల్లో.. ఇంటింటికీ తిరుగుతారు. ప్రజలు భక్తితో పీర్లకు పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకుని భక్తితో కానుకలను సమర్పిస్తారు. పీర్ల ఊరేగింపు సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. మధ్యాహ్నం చావడి వద్దకు, సాయంత్రం వేళల్లో గ్రామ చివర పొలిమేర్లకు హిందూ - ముస్లింలు కలిసి పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ పీర్లను శోభా యాత్రగా తీసుకువెళతారు.

ఆలిండియా పారా అథ్లెటిక్స్‌లో

జిల్లా క్రీడాకారుడికి స్వర్ణం

1500 మీటర్ల పరుగులో అకీరానందన్ సత్తా



వరంగల్ స్పోర్ట్స్, జూలై16: పారా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహిస్తున్న ఆలిండియా పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమకొండకు చెందిన అకిరానందన్ సత్తా చాటి స్వర్ణ పతకం సాధించాడు. అండర్ 19 బాలురు 1500 మీటర్ల పరుగు పందెంలో రాణించిన అకీరానందన్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హనుమకొండ జేఎన్‌ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌లో కోచ్ సారంగపాణి వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఆలిండియా పారా అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన అకీరానందన్ జిల్లా కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేశాడని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, జిల్లా, రాష్ట్ర పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అకిరానందన్‌ను అభినందించారు.

ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్‌గా రామ్‌ప్రకాశ్



శంభునిపేట, జూలై16: మామునూరులోని టీఎస్ఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్‌గా బి.రామ్‌ప్రకాశ్ నియమితుల య్యారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి 7వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న రామ్ ప్రకాశ్‌ను ఇటీవల డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కాగా వరంగల్‌లోని మామునూరులోని 4వ బెటాలియన్‌కు పూర్తిస్థా యిలో బాధ్యతలు అప్పగిస్తూ పోలీసు శాఖ రామ్‌ప్రసాద్‌ను బదిలీ చేసింది. అయితే ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం 5వ బెటా లియాన్ కమాండెంట్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి 4వ బెటాలియన్ కమాండెంట్‌గా అద నపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా మంగళవారం ఆయన నుంచి రామ్‌ప్రకాశ్ బాధ్య తలు స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్, ఏటి నిర్మల, యూనిట్ వైద్యురాలు అన్వేషిణి, ఆర్ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంక టేశ్వర్లు, రాజిరెడ్డి, రమేష్, ఏపీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్, కిరణ్, అశోక్, కృష్ణ ఉన్నారు.

రుణమాఫీతో ఉమ్మడి జిల్లాలో

78,432 రైతులకు లబ్ధి



హనుమకొండ సిటీ , జూలై 16 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు పరిధిలో 78,432 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. డీసీసీ బ్యాంకు పరిధిలోని బ్రాంచిలు, సహకార సంఘాల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర నుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తొలుత రూ. 2 లక్షల రుణమాఫీ ఏక కాలంలో చేయనున్నట్లు ప్రకటించింది. కానీ ప్రస్తుతం 18వ తేదీన లక్ష రుణ మాఫీ అని ప్రకటించడంతో కాస్త ఆయోమయం నెలకొంది. అయితే మరో లక్ష రుపాయల రుణం అంటే మొత్తంగా 2 లక్షల రూపాయల రుణ మాఫీ వివ రాలు మున్ముందు వెల్లడి కావచ్చని బ్యాంకు అధికారులు అంటున్నారు. ఇప్ప టికే టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు పరిధిలోని 78,432 రైతుల రుణమాఫీకి సంబంధించిన వివరాలను అందచే శారు. 18వ తేదీన రుణమాఫీకి సంబంధిం చిన లక్ష రూపాయలు రైతుల ఖాతాల్లో జమ కానున్నట్లు ప్రభుత్వం ప్రకటిం చడం ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రైతు వేదికల్లో రుణమాఫీ లబ్ధిదారు లతో సంబురాలు ఉండడంతో అధికారగణం సిద్ధమవుతోంది.

'పదహారుచింతల్ తండా' కుటుంబానికి కేటీఆర్ అండ

చెన్నారావుపేట, జూలై 16: ఇటీవల వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లోని పదహారుచింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో తల్లిదండ్రులను కోల్పోయి, గాయపడిన గిరిజన అన్నాచెల్లెలికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అండగా నిలిచారు. మంగళవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆ ఇద్దరిని తీసుకొని హైదరాబాద్‌లో కేటీఆర్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈనెల 12న యువ కుడు కత్తితో జరిపిన దాడిలో తల్లిదండ్రులను కోల్పోయి.. గాయపడిన ఇద్దరు పిల్ల లకు అండగా ఉంటామని, వారి చదువుల కోసం ఖర్చులను భరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు రూ.50లక్షల సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. నిందితుడు నాగరాజుకు కఠిన శిక్ష పడేలా డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బాధిత కుటుంబానికి తాము రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మాజీ సర్పంచ్ బానోతు శారదగణేష్ తదితరులు పాల్గొన్నారు.




బాధిత అక్కాతమ్ముడిని పరామర్శిస్తున్న కేటీఆర్

ప్రముఖ ఉర్దూ కవి తాజ్‌ముక్తార్

కన్నుమూత

పలువురి సంతాపం



తాజ్ ముక్తార్ (ఫైల్)

హనుమకొండ కల్చరల్, జూలై 16 : సుప్రసిద్ధ ఉర్దూ కవి కాళోజీ సోదరులకు అత్యంత ఆప్తుడు అయిన హనుమకొండకు చెందిన తాజ్ ముక్తార్ (88) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందడంపై కాళోజీ ఫౌండేషన్, మిత్ర మండలి వరంగల్ రచయితల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షులు రామశాస్త్రి, కార్యదర్శి వి.ఆర్.విద్యార్థి మాట్లాడుతూ.. ఆదర్శ భావాలుగల కవి, కుల మతాలకు అతీతంగా గొప్ప కవిత్వాన్ని సృజించారని ఆయన మృతి ఉర్దూ సాహిత్యానికి తీరని లోటని, ఓరుగల్లు సాహితి ప్రపంచంలో ఆయన లోటు ఎవరూ భర్తీ చేయలేనిదని పేర్కొన్నారు. ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, కేయూ తెలుగు విశ్రాంత ఆచార్యులు బన్న ఐలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత, మహ్మద్ సిరాజుద్దీన్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం పక్షాన బిల్లా మహేందర్, నెల్లుట్ల రమాదేవి, కార్తీకరాజు, బాలబోయిన రమాదేవి, గట్టు రాధిక, వల్సపైడి తదితరులు కూడా వేర్వేరుగా సంతాపం వ్యక్తం చేశారు.

మక్కలు, పత్తికి రికార్డు ధర

ఏనుమాములలో క్వింటా మక్కలు రూ.2,725, పత్తి రూ. 7,350

మట్టెవాడ, జూలై 16: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్క జొన్న, పత్తికి రికార్డు ధర పలికింది. మొక్కజొన్న క్వింటాకు రూ.2,725 ధర, పత్తి క్వింటాకు రూ. 7,350 ధర పలికింది. మార్కెట్ చరిత్రలోనే మొక్కజొన్నలకు ఇంత ధర పలకడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరగడంతో రూ. 7,350 చేరినట్లు వ్యాపారులు తెలిపారు.

మక్కలకు, పత్తికి ధర పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జూలైలో మొక్కజొన్నలు, పత్తి ధర మార్కెట్‌లో రోజు రోజుకు పెరుగుతుంది. దీంతో మార్కెట్‌లో క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

లింక్ క్లిక్ చేశాడు.. రూ.96వేలు పోగొట్టుకున్నాడు..

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 16: జనగామ జిల్లాలో ఓ యువకుడు సైబర్ వలలో పడ్డాడు. వాట్సాప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేసి రూ.96వేలు పోగొట్టుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన పోకల రాజేష్ అనే యువకుడి ఫోన్‌కు ఈ నెల 15వ తేదీన సైబర్ నేరగాళ్లు ఒక లింక్ పంపారు. వందకు రెండు వందలు, రెండు వందలకు నాలుగు వందలు డబ్బులు వస్తాయని అందులో ఆశచూపారు. దీంతో బాధితుడు ఆ లింక్‌ను క్లిక్ చేశాడు. అంతే.. క్షణాల్లోనే బ్యాంకు ఖాతాలోని రూ.96వేలు వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటూ మరుసటి రోజు మంగళవారం ఘన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ముస్క రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డబ్బులు ఆశచూపుతూ వాట్సాప్‌లకు వచ్చే లింక్‌లను ఎవరూ క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ వలలో చిక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గంజాయి కేసులో ఒడిస్సా వాసికి పదిన్నర ఏళ్ల జైలు



కేసముద్రంలో గంజాయి కేసులో అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సత్యనారాయణ (ఫైల్)

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జూలై 16 : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఒరిస్సాకు చెందిన వ్యక్తికి పదిన్నరేళ్ల జైలు శిక్షను మహబూబాబాద్ జిల్లా జడ్జీ పి.చంద్రశేఖరప్రసాద్ విధించినట్లు కేసముద్రం ఎస్ఐ వంశీధర్ మంగళవారం తెలిపారు. గత ఏడాది అక్టోబర్, 16న కేసముద్రం స్టేషన్ గాంధీసెంటర్‌లో రూ.4 లక్షల విలువైన 16.29 కిలోల గంజాయిని ఒరిస్సా రాష్ట్రం గంజం జిల్లా పెరగడ గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ ప్రధాన్ అనే వ్యక్తి తరలిస్తుండగా, అదేరోజు పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఎస్ఐ కోగిల తిరుపతి తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ దామోదర్ పంచనామా నిర్వహించగా ఎస్ఐ తిరుపతి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేష్ సమక్షంలో నిందితున్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జీ చంద్రశేఖర ప్రసాద్ నిందితునికి పది సంవత్సరాల ఆరునెలల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.1లక్ష జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ వివరించారు. గంజాయి కేసులో నిందితునికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

వరంగల్ కేఎంసీలో 'సూపర్' సేవలు దూరం

సమయానికి విధులకు రాని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు

సేవల కోసం రోగుల పడిగాపులు

వరంగల్ మెడికల్, జూలై 16 : వరంగల్ కాకతీయ మెడికల్ వైద్య కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సూపర్ సేవల కోసం రోగులు పడిగాపులు కాస్తున్నారు. వైద్యులు సమయం పాటించకపోవడంతో వైద్యం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేద రోగుల బాగోగులు చూడాల్సిన వైద్యులు వేళాపాళా లేకుండా విధులకు హాజరు కావడం ఇబ్బందిగా మారుతోంది. మంగళవారం ఉదయం అనేక విభాగాల్లో వైద్యులు రాకపోవడంతో గంటల తరబడి వార్డుల్లోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజూ 12 గంటల వరకు ఓపీ ఉంటుండగా.. డాక్టర్ల కోసం నిరీక్షించాల్సిందేనని రోగులు వాపోతున్నారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తమ గోడు పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో రోస్టర్ విధానం ద్వారా సూపర్ సేవలు



వైద్యుల కోసం పడిగాపులు కాస్తున్న రోగులు

అందుతున్నాయి. మంగళవారం న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ విభాగానికి వచ్చే రోగులను లోనికి తీసుకెళ్లేందుకు కనీసం స్ట్రెచర్లు కూడా అందుబాటులో లేవు.

డాక్టర్లు ఎప్పుడు వస్తారనే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు కూడా కనిపించడం లేదు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ దగ్గరికి కొందరు వెళ్లగా ఎంజీఎంలో రోగులను చూసి ఇక్కడకు వస్తారని సమాధానం ఇస్తున్నారని రోగులు పేర్కొంటున్నారు. కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సమయం పాటించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

హత్య కేసు నిందితుల లొంగుబాటు

పరారీలో ప్రధాన నిందితుడు



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న జనగాం వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్

వర్ధన్నపేట, జూలై 16: భూమి కొనుగోలు విషయంలో జరిగిన గొడ వలో హత్య చేసిన ముగ్గురిని రిమాం డ్‌కు తరలించినట్లు జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ముగ్గురి నిందితు లను హాజరుపర్చారు. అనంతరం డీసీపీ హత్యకు సంబంధించిన వివరా లను వెల్లడించారు. రాయపర్తి మండలం బురహాన్‌పల్లికి చెందిన సూదిళ్ల దేవేందర్, అదే గ్రామానికి చెందిన పల్లె మల్లేశంనకు భూమి కొనుగోలు విషయంలో గొడవలు జరు గుతున్నాయన్నారు. 2022లో పల్లె మల్లేశంపై హత్యా యత్నం చేసిన కేసులో దేవేందర్ అతని అనుచరులపై న్యాయస్థానంలో కేసు నడుస్తోందని తెలిపారు. ఈక్రమంలో దేవేందర్, మల్లేశంను భయభ్రాంతులకు గురిచేస్తుండటం తోపాటు హత్య చేయడానికి యత్నిస్తుండడాన్ని మల్లేశం గ్రహించాడు. ఈక్రమంలో ఈనెల 7న దేవేందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకున్న మల్లేశం, ఆయన కుమా రుడు మురళి, బొందిళ్ల చెన్నారాయుడు, హర్జన్ గోవింద్‌తో కలిసి ఇంట్లోకి ప్రవేశించి సుత్తితో కొట్టి చంపారు. హత్యకే సులో ప్రధాన నిందితుడిగా ఉన్న పల్లె మురళి పరారిలో ఉండగా మిగిలిన ముగ్గురు నిందితులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ప్రధాన నిందితుడు మురళి కోసం మూడు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. సమావేశంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుగోలుకు డీఎంహెచ్‌వో

కాలినడకన వెళ్లి ఆదివాసీలకు వైద్యం అందించిన అప్పయ్య



పెనుగోలు గుట్టలు ఎక్కుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వాజేడు, జూలై 16: ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య ఎంతో శ్రమకోర్చి తన వృత్తిధర్మాన్ని నిర్వర్తించారు. వాజేడు మండల పరిధి తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంలో ఎలాంటి రవాణా సౌకర్యం లేని కుగ్రామానికి కాలినడకన వెళ్లి ఆదివాసీలకు వైద్యం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వాజేడుకు వచ్చిన ఆయన సిబ్బందితో కలిసి గుమ్మడిదొడ్డి మీదుగా మూడు వాగులు, గుట్టలు దాటుకుంటూ సుమారు 17 కిలోమీటర్లు నడిచి పెనుగోలుకు వెళ్లారు. గుట్టలపై నివసిస్తున్న ఆదివాసీలకు వైద్య పరీక్షల నిమిత్తం బయల్దేరారు. మంగళవారం రాత్రి పెనుగోలులో బస చేసి బుధవారం ఆదివాసీలకు వైద్యపరీక్షలు, దోమ తెరలను పంపిణీ చేయనున్నారు. ఎనుగోలు గుట్టలకు డీఎంహెచ్‌వో వెళ్లడం ఇదే ప్రథమం. ఆయన వెంట వాజేడు వైద్యాధికారి మహేందర్, హెచ్ఏ చిన్నవెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఏటూరునాగారం రూరల్ : ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో అప్పయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌లో పేర్కొన్న విధంగా ఆస్పత్రులను నడపాలని సూచించారు. పేషెంట్ కేస్ షీట్‌లో వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరచాలని, అనుమతులున్న మేరకే బెడ్స్ స్థాయి ఉండాలన్నారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సంక్రమణ వ్యాధులకు సంబంధించిన రోగా నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ వస్తే వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు వివరాలను తెలియచేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రులకు నోటీసు జారీ చేశారు.

ప్రాణం తీసిన హైవే గుంత

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

జాతీయ రహదారిపై బంధువుల ఆందోళన



శీనివాస్ (ఫైల్)

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 16 : జాతీయ రహదారి 365పై ఏర్పడిన గుంత కారణంగా ఒకరి ప్రాణం పోగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘ టన మంగళవారం రాత్రి మరి పెడలోని గంగా వైన్స్ సమీపంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, కుటుంబసభ్యులు ఘటనాస్థలి వద్ద ఆందోళన చేశారు. మరిపెడ పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలి పిన వివరాల ప్రకారం. వీరారం గ్రామానికి చెందిన తాళ్ల శ్రీను, ఆయన కుమారుడు రాకేశ్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మరిపెడలోనిహైవేపై ఏర్పడిన గుంతలో వారి ద్విచక్రవాహనం పడడంతో వాహనం అదుపుతప్పి కిం దపడగా తండ్రి శ్రీను (45) అక్కడికి అక్కడే మృతి చెందగా, కుమారుడు రాకేశ్ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన మృతుడి బంధువులు ఘటనాస్థలం వద్ద ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబా నికి ఎన్‌హెచ్ఏ అధికారులు న్యాయం చేయాలని నినదిం చారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పి, శాంతింప చేశారు. వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్న శ్రీనుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చిరువ్యాపారి హత్య కేసులో ఒకరి అరెస్ట్

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జూలై16 : కేస ముద్రం విలేజి పూలే సెంటర్ సమీపంలో ఈనెల 14న సాయంత్రం చోటు చేసుకున్న జిలుకర నాగరాజు హత్య కేసులో, ఇదే గ్రామానికి చెందిన వల్లందాసు నగేష్‌ను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. స్థానికంగా తీవ్ర సంచలనం రేపిన కేసులో అరె స్ట్ వివరాలను కేసముద్రంలో రూరల్ సీఐ మంగళవారం వెల్లడించారు. పూలే సెంటర్ సమీపంలో చిన్నడబ్బా ఏర్పా టు చేసుకొని జీవనం సాగిస్తున్న వల్లందాసు నగేష్‌కు జిలుకర నాగరాజుతో కొంతకాలంగా వ్యక్తిగత కక్ష ఏర్పడింది. గతనెల రోజులుగా నాగరాజును హతమార్చాలని నగేష్ ప్రయ త్నాలు చేస్తూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. నాగరాజు అనుమానంతో నగేష్‌తో జాగ్రత్తగా ఉంటు న్నాడు. ఈ క్రమంలో ఆదివారం నగేష్ భార్య అనారోగ్యంతో బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం నాగరాజు డబ్బాదుకాణం వద్దకు నగేష్ మద్యం సేవించి, వచ్చాడు. ఇదే అదనుగా భావించిన నగేష్ తన డబ్బా దుకాణం వెనుకనే ఉన్న ఇంట్లోకి మద్యం తాగుదామని నాగరాజును పిలిచాడు. అప్పటికే నాగరాజు మద్యం సేవించి ఉండడంతో అనుమానం లేకుండా నగేష్ ఇంట్లోకి వెళ్లాడు. అక్కడ నాగరాజుకు మరికొంత మద్యాన్ని నగేష్ పోశాడు. నాగరాజు మద్యం బాగా సేవించిన అనంతరం నగేష్ వెంటనే నాగ రాజు తలపై కర్రతో బలంగా కొట్టగా, ఆ దెబ్బకు నాగరాజు కిందపడిపోయాడు. ఆ తర్వాత కాలితో నాగరాజు మెడపై తొక్కడంతో ఊపిరి ఆడక నాగరాజు మృతి చెందాడు. ఆ వెంటనే నగేష్ అక్కడి నుంచి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోగా, పూర్తి విచారణ అనంతరం ఆధారాలను సేకరించి నిందితున్ని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు రూరల్ సీఐ తెలిపారు.

'బాలికలను చైతన్యవంతం చేయాలి'

జనగామ రూరల్, జూలై 16: బాలికలకు ఆత్మస్థైర్యాన్ని కల్గించేలా చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని డీడబ్ల్యూవో జయంతి సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో బాలల పరిరక్షణ, పోలీస్, న్యాయ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీడబ్ల్యూవో జె.జయంతి మాట్లాడుతూ 'బేటీ బచావో - బేటీ పడావో' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితిలలో మహిళల హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో బాల పరిరక్షణ అధికారి లక్కుంట్ల రవికాంత్, ఎస్ఐ శ్వేత, న్యాయవాది స్వప్న, సఖి నిర్వాహకులు రేణుక తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

పాలకుర్తి, జూలై 16 : మండలంలోని వావిలాల గ్రామంలో నలుగురి పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామానికి చెందిన సత్తూరు సంపత్, అనపర్తి సోమక్క, రామానుజం, గద్దల ఎల్లమ్మ సోమవారం రాత్రి నిద్రిస్తుండగా వారిపై దాడి చేసి కాళ్లు, అరికాళ్లను గాయపచింది. వారు మంగళవారం పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఈ విషయంలో అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'వాస్విక్ ఫౌండేషన్'కు ఇన్‌స్పైరింగ్ అవార్డు

బచ్చన్నపేట, జూలై 16: వాస్విక్ ఫౌండేషన్ నిర్వాహకులకు అపూర్వ గౌరవం దక్కింది. నేషనల్ హ్యూమన్ వెల్ఫేర్ కౌన్సిల్‌కు చెందిన సంస్థ వాస్విక్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, కార్యనిర్వాకుడు హేమంత్‌ను ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డులకు ఎంపిక చేసింది. దేశవ్యాప్తంగా వందమందిని ఇందుకోసం ఎంపిక చేయగా, తెలంగాణ నుంచి 10 మందిని ఎంపిక చేశారు. ఇందులో ముగ్గురు వాస్విక్ ఫౌండేషన్‌కు చెందినవారు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పాఠశాలలు, ఆస్పత్రుల్లో చేస్తున్న సేవలు, పేద వర్గాలకు అందిస్తున్న సాయం, పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు అందజేత, రక్తదాన, అన్నదానాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటాన్ని గుర్తించి అవార్డులు ప్రకటించారు. ఈనెల 19న న్యూఢిల్లీలోని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందించనున్నారు. ఈ అవార్డులకు తాము ఎంపిక కావటంపై నరేష్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, హేమంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

జనగామ కల్చరల్, జూలై 16: సివిల్స్‌లో ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువును పొడిగించినట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కె. దయానందరాణి ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేపట్టే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హైదరాబాద్‌లో ఉచితంగా ఇచ్చే శిక్షణకు జూలై 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు స్టడీసర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు..

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులను ఈ నెల 15 నుంచి 18కి పెంచినట్లు డీఈవో కె.రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ అవార్డులకు దరఖాస్తు చేసుకోదలచుకున్న ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భూ తగాదా కేసులో ఇద్దరికి రిమాండ్

చిలుపూర్, జూలై 16 : భూ తగాదాల నేపథ్యంలో ఒకరిపై అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచిన కేసులో తల్లీకొడుకులను రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపూర్ పరిధిలోని ఎర్రకుంటతండాకు చెందిన గుగులోతు చాందిని, భూక్య వీరన్నకు మధ్య కొద్ది రోజులుగా భూ వివాదం నెలకొంది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం రెండు కుటుంబాల మధ్య గొడవ జరుగగా, గుగులోతు చాందిని, ఆమె కుమారుడు రవి కలిసి వీరన్నపై దాడికి దిగారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని ఎస్సై రాజేందర్ తెలిపారు.


జనగామలో ర్యాలీ ప్రారంభిస్తున్న సీడీపీవో రమాదేవి తదితరులు


కొడకండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడి సిబ్బంది


నమిలిగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చిన్నారులను అంగన్‌వాడికి పంపాలి

- జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి
- జిల్లాలో కొనసాగుతున్న అంగన్‌వాడి బాట

జనగామ కల్చరల్, జూలై 16: చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారి, సీడీపీవో డి.రమాదేవి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సత్రం ఏరియా, కుర్మవాడ, హనుమాన్‌వాడలో జిల్లా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మమాట- అంగన్వాడి బాట కార్యక్రమంపై ప్రచార ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు రెండున్నర సంవత్సరాలు నిండిన బాలబాలికలను అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలన్నారు. అక్కడ ఆటపాటలతో పాటు విద్య, పోషకాహారం అందిస్తామని, అది వారి మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సెక్టార్ అర్బన్ సూపర్‌వైజర్ పూర్ణిమ, అంగన్వాడి టీచర్లు వి.స్వర్ణలత, కె.శ్రీజయ, హెల్పర్లు ప్రమీల, లక్ష్మి పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలంలోని అన్ని అంగన్వాడి సెంటర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం అమ్మమాట- అంగన్వాడి బాట కార్యక్రమం కొనసాగినట్లు సూపర్‌వైజర్ సరళ తెలిపారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించేలా ప్రోత్సహించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, ఏఎన్ఎం జ్యోతి, అంగన్వాడీ టీచర్లు ఉప్పల సరిత, మంజుల, మాధవి, మహమూద, ఉప్పలక్ష్మి, వినోద, నర్సమ్మ హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మరిగడిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పఠశాల చైర్‌పర్సన్ మచ్చ రజిత, హెచ్‌ఎంలు మధుకర్ రెడ్డి, రేణుకుంట్ల మురళి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీలో చేర్పించి పిల్లలను చదివించి నట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు యాకలక్ష్మి, సుజాత, ఉపాధ్యాయులు స్టీఫెన్, సాంబరాజు, శివరంజని రెడ్డి, భవాని, వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: ప్రభుత్వం చేపట్టిన 'అమ్మ మాట - అంగన్‌వాడి బాట' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని తీగారం, హిమ్మత్‌నగర్, తదితర గ్రామాల్లో తల్లిదండ్రులు, పిల్లలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ రెండున్నరేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గోనె జయపాల్‌రెడ్డి, టీచర్లు శారద, ఎఎల్ఎంసీ సభ్యులు రోజా, సోమలక్ష్మి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామంలో అమ్మ మాట.. అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ జేసుమణి ప్రారంభించి మాట్లాడారు. తల్లితండ్రులు రెండున్నర ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని కోరారు. సెంటర్ల ద్వారా ఎదిగే పిల్లలకు పోషకాలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు బి.రజిత, సుజాత, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలంలో బోర్డులు ధ్వంసం

చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం: డీఎం మోహన్‌రావు

జఫర్‌గడ్, జూలై 16: మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలంలో గల హెచ్చరికల బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి కూల్చి వేశారు. 201 సర్వే నంబరులో ఆర్టీసీకి 1200 గజాల స్థలం ఉంది. ఈ స్థలం తమదేనంటూ ఏడాది క్రితం కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు యత్నించారు. సీపీఎంతో పాటు గ్రామస్తులు సంఘటితమై ఆందోళన నిర్వహించి స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు. దీంతో వారు స్పందించి ఎవరేని ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ రెండు బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళ ఆ బోర్డులను కూల్చివేయడంతో మంగళవారం సీపీఎం ప్రతినిధులు పరిశీలించి ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్టీసీ వరంగల్ -1 డిపో మేనేజర్ మోహన్‌రావు, ఇంజనీరింగ్ అధికారి భాస్కర్‌తో కలిసి మంగళవారం మధ్యాహ్నం సదరు స్థలాన్ని పరిశీలించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ జఫర్‌గడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే కబ్జాకు యత్నం: సీపీఎం

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్లే స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య ఆరోపించారు. మంగళవారం ఆయన జఫర్‌గడ్‌లో ఆర్టీసీ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యార్థం బస్టాండ్‌ను నిర్మించాలని కొన్నేళ్లుగా ఆర్టీసీ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఆ స్థలంలో ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే పేదలతో గుడిసెలు వేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాట సుధాకర్, నల్లతీగల శ్రీను, మంద యాదగిరి, నర్సింగం, ఎస్.ఎల్లయ్య, సాయిలు, యాకయ్య, సారంగం తదితరులు పాల్గొన్నారు.


కూల్చిన బోర్డులను పరిశీలిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్, గ్రామస్థులు

ఉపాధ్యాయుల పని సర్దుబాటు వద్దు

టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

జనగామ కల్చరల్, జూలై 16: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టీపీటీఎఫ్ నాయకులు మంగళవారం డీఈవో రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లలో ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులను కేటాయించారని అన్నారు. కానీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మాత్రమే పోస్టులను భర్తీ చేశారన్నారు. కొన్ని పోస్టులను హైడ్ చేసి ఇప్పుడు అరకొరగా ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను కొందరిని మళ్లీ పని సర్దుబాటు కింద ఉన్నత పాఠశాలలకు కేటాయించడం వల్ల ప్రాథమిక పాఠశాలలో కొరత ఏర్పడుతోందన్నారు. వెంటనే ఉపాధ్యాయుల పని సర్దుబాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.రాజు, శ్రీరామ్, కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నేరవేర్చాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్

జనగామ రూరల్, జూలై 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శి మోకు కనుకరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ఉద్యోగాలు ఇస్తానని గారిడి మాటలు చెప్పి నిరుద్యోగలను మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాపర్తి రాజు, యాదగిరి, అలియా, సింగారపు రమేష్, జోగు ప్రకాశ్, గోపి పాల్గొన్నారు.

గేటు పడితే గండమే

- రఘునాథపల్లి-పాలకుర్తి రోడ్డుపై రైల్వే సిగ్నల్
- గంటలకొద్దీ ఆగుతున్న వాహనాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలంటూ విన్నపం

రఘునాథపల్లి, జూలై 16: మండలకేంద్రంలో ఉన్న రైల్వే గేటు మూలంగా రఘునాథపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గేటు పడితే రఘునాథపల్లి నుంచి బాంజిపేట, కంచనపల్లి, గబ్బెట, కోడూరు, పాలకుర్తి మీదుగా తొర్రూరు వెళ్లే/వచ్చే వాహనాలన్నీ నిలిచిపోతాయి. దీంతో రైతులు, ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, వివిధ వృత్తి పనివారు ఇబ్బందిపడుతున్నారు. గేటు పడిందంటే ఒక్కోసారి పది నుంచి ముప్పై నిమిషాల సమయం పడుతుంది. ఈలోగా గేటుకు ఇరువైపులా అనేక వాహనాలు ఆగిపోతాయి. ప్రతీ రోజు సికింద్రాబాద్ నుంచి కాజీపేట, కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపు సుమారు 145 నుంచి 150 వరకు రైళ్ల రాకపోకలు కొనసాగుతుంటాయి. ప్రతీ 8 నిమిషాలకు ఒక రైలు వెళ్తుంది. ఈ గేటు గుండానే రఘునాథపల్లి నుంచి కంచనపల్లి, గబ్బెట, కన్నాయిపల్లి, కోడూరు, రామన్నగూడెం, శివాజీనగర్, పాలకుర్తి, బాంజీపేటకు ప్రతీ రోజు వందలాది వాహనాలు వచ్చి పోతుంటాయి. గేటు పడితే ఒక్కొక్కసారి మూడు రైళ్లు వెళ్లే వరకు కుడా తీయరు. దీంతో అత్యవసర పనులపై హన్మకొండ, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. వివిధ గ్రామాల నుంచి జనగామ, హన్మకొండకు వెళ్లే విద్యార్థులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. రైల్వే ఫ్లై- ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అయిదు సంవత్సరాలు గడిచినా ఇంతవరకు 'ఎక్కడవేసిన గొంగలి అక్కడే' అన్నచందంగా ఉంది పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రైల్వే ఫ్లై- ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



గేటు పడితే నరకం చూస్తున్నాం..



ప్యారపు రాములు, కంచనపల్లి

రైల్వే గేటు ఎప్పుడు పడినా చాలా సమయం వృథా అవుతోంది. ఒకొక్కసారి దూర ప్రయాణాలను కుడా వదులుకోవాల్సి వస్తుంది. గేటు పడుతుందనే భయంతో వేగంగా వచ్చి వాహనాలు ఢీకొన్న సంఘటనలు కుడా ఉన్నాయి. కొందరు పనులకు వెళ్లేవారు సైతం రద్దు చేసుకొని వెనుదిరుగుతారు. వెంటనే రైల్వే ఫ్లై-ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

సత్వరమే బ్రిడ్జి నిర్మించాలి..



కర్మికొండ వెంకటేశ్వర్లు, రఘునాథపల్లి

మా వ్యవసాయ భూములు రైల్వే గేటు అవతలి వైపే ఉన్నాయి. పనులకు వెళ్లాలంటే కూలీలను ఆటోలో తీసుకువెళ్లాల్సిందే. కూలీలు వ్యవసాయ పనులకు వెచ్చించే సమయం కన్న రైల్వే గేటు పడ్డప్పుడు అక్కడ వేచి ఉండే సమయమే ఎక్కువగా ఉంటుంది. ఒకొక్కసారి రెండు..మూడు రైళ్లు వెళ్లాక కానీ గేటు తీయకపోవడంతో 30 నుంచి 45 నిమిషాల వరకు వేచి చూడాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వే ఫ్లై- ఓవర్ బ్రిడ్జిని నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి.

పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలి

అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ రూరల్, జూలై 16: వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు ప్రాణకోటికి జీవనాధారమని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేయాలన్నారు. జనగామ పట్టణాన్ని పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలని, ఆకట్టుకునే విధంగా పూల మొక్కలు నాటి పరిరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

పాలకుర్తి, జూలై 16 : బీజేపీ మండల నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. నాలుగు నెలల క్రితం ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా పాలకుర్తికి చెందిన దుంపల సంపత్‌ను నియమించగా పూర్తి స్థాయి కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శులుగా పెనుగొండ సోమేశ్వర్, మారం రవికుమార్, వేల్పుల దేవరాజ్ ఉపాధ్యక్షులుగా బోనగిరి శ్రీనివాస్, కమ్మగాని నగేష్, కాసోజు సమ్మయ్య చారీ, నూనావత్ శంకర్, ఈర్ల రాజు ఎన్నికయ్యారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడుగా మామిండ్ల వెంకన్న, ఎస్టీ మోర్చా అధ్యక్షుడుగా లాకావత్ రవి, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా లాకావత్ సుజాత, కిసాన్ మోర్చా అధ్యక్షుడుగా కుదురు మహేందర్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడుగా ఎండి నజీర్, దళిత మెర్చా అధ్యక్షుడుగా కొడిశాల కొడిశాల యాదగిరి, యువ మోర్చా అధ్యక్షుడిగా గోనె అమరేందర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రవీన్ ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు దుంపల సంపత్ తెలిపారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న
- కృష్ణాజీగూడెంలో వివాదాస్పద ప్రభుత్వ స్థల పరిశీలన


కృష్ణాజీగూడెంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో డీఎస్ వెంకన్న

చిలుపూర్, జూలై 16: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న సూచించారు. మంగళవారం ఆయన కృష్ణాజీగూడెం గ్రామాన్ని సందర్శించి హెల్త్ సెంటర్ పక్కన బీసీ కాలనీలో ఉన్న 320 గజాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఎస్సీ కమ్యూనిటీ హాల్, మహిళా సంఘం భవనం నిర్మాణాల విషయంలో స్థల వివాదం నెలకొందన్నారు. ప్రత్యేక అధికారి అధ్యక్షతన, గ్రామసభలో చేసిన ఏకాభిప్రాయ తీర్మానం మేరకే స్థల కేటాయింపు జరుగుతుందని, ఎవరూ అనవసర ఆందోళనలు చేయవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ విమల, ఎమ్మారై కలువల శ్రీనివాస్, మండల రెవెన్యూ సర్వేయర్ నరేష్‌కుమార్ నాయక్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ఎర్రబెల్లి చేరాలు, మారపాక ఇస్సాక్, సాదం రాజేందర్, రామరాజు, సాదం భీమన్న, మచ్చ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజం కోసం మొక్కలు నాటాలి..

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరోగ్యకరమైన సమాజస్థాపనకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న సూచించారు. మంగళవారం ఆయన ఘన్‌పూర్‌లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా మొక్కలు నాటి భావితరాలకు స్వచ్ఛమైన వాతవరణం అందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడాన్ని ప్రతీ ఒక్కరు వారి బాధ్యతగా భావించి సమాజ మేలుకోసం పాటుపడాలని కోరారు. మొక్కలు విరివిగా ఉంటేనే స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఈవో గట్టు మంజుల, సిబ్బంది శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సమీక్ష

కొడకండ్ల, జూలై 16 : మండలంలోని మొండ్రాయిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధిపై మంగళవారం సమీక్షించారు. వీధులన్నీ తిరిగి అభివృద్ధి పనులను, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామపెద్దల అభిప్రాయాలను తీసుకుని అభివృద్ధిపై నివేదిక తయారు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సమస్యలను ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సోమనర్సయ్య, కార్యదర్శి ధర్మారం భిక్షపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ నాయక్, గ్రామపార్టీ అధ్యక్షుడు మచ్చ మల్లేష్, మసురం రవీందర్, సునీల్ రెడ్డి, శోభ, అబ్దుల్లా, సుమన్, వెంకట్రాం పాల్గొన్నారు.

వరదనీటి నివారణకు చర్యలు

ఎంపీవో శ్రీపాద మధుసూదన్

డ్రైయినేజీ నిర్మాణానికి చర్యలు చేపడతామని వెల్లడి


చిన్నపెండ్యాల ఎస్సీకాలనీలో వరదనీటితో నిండిన రోడ్డు


మొరం పోయిస్తున్న ఎంపీవో మధుసూదన్

చిలుపూర్, జూలై 16 : మండలంలోని చిన్నపెండ్యాల ఎస్సీకాలనీలో వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎంపీవో (మండల పంచాయతీ అధికారి) శ్రీపాద మధుసూదన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్సీకాలనీని సందర్శించిన ఆయన సీసీరోడ్డుపై, జనావాసాల మధ్యలో పేరుకుపోయిన వరదనీటిని పరిశీలించారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా వరదనీటిని తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. సీసీరోడ్డును ఆనుకుని కందకం తీయించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ కాలనీ చివరన ఉన్న ఇండ్లు దిగువ ప్రదేశంలో ఉండడంతో పైనుంచి వచ్చే వర్షపునీటితో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు సమీప జనావాసాలకు ఇబ్బంది కలుగకుండా డ్రైయినేజీని నిర్మించేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తౌటిరెడ్డి శశిధర్ రెడ్డి, ఎమ్మీ అజీజ్‌పాషా, కారోబార్ ఇల్లందుల సారయ్య, స్థానికులు ఎడ్ల మొగిలి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా

ప్రజ్ఞాపురం శ్రీధర్



నర్మెట, జూలై 16 : కబడ్డీ అసోసియేషన్ నర్మెట మండల కమిటీని జిల్లా కార్యదర్శి తోటకురి గట్టయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా మండలకేంద్రానికి చెందిన ప్రజ్ఞాపురం శ్రీధర్, సెక్రటరీగా తేజావత్ మోహన్, ఉపాధ్యక్షులుగా జాటోతు సురేష్, ఇట్టబోయిన రాజు, కోశాధికారిగా నేతావత్ అరుణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్, కోశాధికారి ఎదునూరి ఉప్పలయ్య, ప్రభుదాసు, ఆనంద్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.